

అన్నవరంలో అభివృద్ధి పనులకు పాలకమండలి ఆమోదం
- రూ.46.75లక్షలతో సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవ పనులు
- రత్నగిరిపై దాతలకు ప్రత్యేక సౌకర్యాల కల్పనకు గ్రీన్‌సిగ్నల్

- 7లో

సబ్‌ప్లాన్ ఏజెన్సీలో గిరిజనులు

కపట ప్రేమ!

- జిల్లాలో 24వేల మంది గిరిజనులపై జగన్ ప్రభుత్వం కపట ప్రేమ
- 'నా ఎస్టీలు' అంటూనే వారిని నిలువునా ధగా చేస్తోన్న ప్రభుత్వం
- కొత్త జిల్లాల విభజనతో రెండేళ్ల కిందట రంపచోడవరం ఐటీడీఏతో సంబంధాలు కట్
- శంఖవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కోటనందూరు, రౌతులపూడి మండలాల గిరిజనులకు అన్యాయం
- సర్వే చేసి ఐదు మండలాల్లో 59 గ్రామాల్లో 24 వేల గిరిజనులున్నట్లు లెక్క తేల్చిన అధికారులు
- వీరికి కొత్త ఐటీడీఏకు ప్రతిపాదన
- లేదంటే షెడ్యూల్-5లో చేర్చి గిరిజన సంక్షేమం చేపట్టాలని ప్రభుత్వానికి ఫైలు
- ఏడాదిన్నరవుతున్నా పట్టించుకోని జగన్ ప్రభుత్వం
- ఏదొక నిర్ణయం తీసుకోవాలని కోరినా ప్రభుత్వం గప్‌చుప్
- పట్టించుకోవాల్సిన మంత్రి రాజా, ఎమ్మెల్యే పర్వత సంబంధం లేదన్నట్లు వ్యవహారం


(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో గిరిజనులపై జగన్ ప్రభుత్వం కపట ప్రేమ నటిస్తోంది. మాట్లాడితే నా ఎస్టీలు అని సంబోధించే సీఎం జగన్ ఆచరణలో మాత్రం వారి సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశారు. మాటల్లో చూపించే ప్రేమ చేతల్లో చూపించకుండా మాయ చేస్తున్నారు. రెండేళ్లు గా వీరి ఆలనాపాలనను గాలికి వదిలేసి వారిని పట్టించుకోవడం మానేశారు. జిల్లాల విభజనతో నష్టపోయిన వీరికోసం ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు.. లేదంటే షెడ్యూల్-5 కింద నోటిఫై చేసి సంక్షేమం అమలు చేయాలని జిల్లా అధికారులు పంపిన ఫైలును ప్రభుత్వం తొక్కిపెట్టేసింది. అసలు దీనిపై నిర్ణయం తీసుకోకుండా పూర్తిగా పక్కన పడేసింది. దీనిపై జిల్లా అధికారులు అదేపనిగా ప్రభుత్వానికి గుర్తుచేసినా పట్టించుకోకపోవడంతో ఇప్పుడు విసుగెత్తి వదిలేశారు. తన నియోజకవర్గానికి సంబంధించిన ఈ సమస్యపై మంత్రి రాజా, ఎమ్మెల్యే పర్వత కనీసం ఏం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడమే మానేశారు. ఫలితంగా జిల్లాలో 59 గ్రామాల్లోని గిరిజనులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

అంతా ధగా..

ఉమ్మడి జిల్లాలో తుని నియోజకవర్గంలోని కోటనందూరు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి, శంఖవరం మండలాల్లోని ఏజెన్సీ, సబ్‌ప్లాన్ ఏజెన్సీ పరిధిలోని గిరిజనులు రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉండేవారు. వీరి ఆలనాపాలనా, ఇతర సంక్షేమం, విద్య, వైద్య, ఇతర మౌలిక వసతుల కల్పన అంతా ఐటీడీఏ పర్యవేక్షించేది. కానీ 2022లో జిల్లాల విభజనతో రంపచోడవరం ఐటీడీఏ అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాలోకి వెళ్లిపోయింది. అప్పటినుంచీ ఐటీడీఏ అధికారులు కాకినాడ జిల్లా పరిధిలోకి వచ్చే గిరిజనులతో తమకు సంబంధం లేదని తేల్చేశారు. అన్నిరకాల పథకాలను నిలిపివేశారు. ఈ నేపథ్యంలో ఆదివాసీలు ఆందోళనకు దిగడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక సర్వే చేసింది. రెండు నియోజకవర్గాల పరిధిలోని ఐదు మండలాల్లో మొత్తం 59 గ్రామాల్లో 24వేల మంది గిరిజనులు ఉన్నట్లు తేల్చింది. వీరందరి భాగోగులు రంపచోడవరం ఐటీడీఏ పట్టించుకోనందున ఇకపై ఆ బాధ్యతలు ఎలా నిర్వర్తించాలనే దానిపై అధ్యయనం చేసింది. అందులో భాగంగా 24వేలమంది కోసం ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. లేనిపక్షంలో షెడ్యూల్-5 ప్రాంతంగా గుర్తించి సంక్షేమం అందించాలని తీర్మానించి ఫైలు తయారు చేసింది. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఫైలుకు ఆమోదం తెలిపి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. జిల్లా పరిధిలోకి వచ్చిన గిరిజనుల సంక్షేమంపై జాప్యం లేకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. అప్పటి ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశం కూడా గిరిజనులకు న్యాయం చేయాలంటూ ఏకగ్రీవంగా ప్రతిపాదించింది. తుని, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు కూడా దీనికి అంగీకారం తెలిపారు. ఈనేపథ్యంలో 2022, ఆగస్టులో జిల్లా గిరిజన సంక్షేమశాఖ ప్రభుత్వానికి ఈఫైలు పంపించింది. గిరిజనుల సంక్షేమం దృష్ట్యా తగు నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఈ ఫైలు పంపి ఇప్పటికి ఏడాది న్నర అవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించడంలేదు. జిల్లా నుంచి వెళ్లిన ఫైలును పరిశీలించకుండా పక్కన పడేసింది.

వారికి పట్టదంటే..

తమ నియోజకవర్గం పరిధిలోని ప్రజలకు ఏ ఇబ్బందులు ఉన్నా సంబంధిత ఎమ్మెల్యేలు చొరవ చూపి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తారు. కానీ ఏడాదిన్నరగా గిరిజనులు అసలు ఏ సంక్షేమం అందక విలవిల్లాడుతున్నా తుని, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు ఖాతరే చేయడంలేదు. తుని ఎమ్మెల్యే రాజా జిల్లా మంత్రిగా ఉన్నారు. ఆయన ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఫైలుకు మోక్షం కల్పించి తగు నిర్ణయం వచ్చేలా చేసే అవకాశం ఉంది. కానీ ఆయన పట్టించుకోవడమే మానేశారు. సీఎం జగన్ ఈ ఏడాదిన్నరలో పెద్దాపురం, కాకినాడ సిటీ నియోజకవర్గాల పర్యటనలకు వచ్చిన సమయంలోనైనా ఒత్తిడి తెస్తే గిరిజనులకు న్యాయం జరిగేది. కానీ ఆ ఊసే మర్చిపోయారు. ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలో నాలుగు మండలాల్లో గిరిజను లున్నా ఎమ్మెల్యే పర్వతది కూడా అదే వైఖరి. ఇప్పుడు ఏకంగా సీటు కోల్పోవడంతో తనకు సంబంధం లేనట్లే వ్యవహరిస్తున్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ తరుణంలో ప్రభుత్వం కూడా ఇప్పటికే ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో గిరిజనుల సమస్యకు మోక్షం కలగడం ఇక అసాధ్యంగానే కనిపిస్తోంది.

చూద్దాంలే అనే ధోరణితో..

సాధ్యమైనంత వేగంగా ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని గిరిజనులు నమ్ముతూ వస్తున్నారు. కానీ ఏడాదిన్నర అవుతున్నా పట్టించుకోకపోవడంతో వారంతా ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మాట్లాడితే నా ఎస్టీలు అని ప్రేమ ఒలకబోసే సీఎం గిరిజనుల బాధలు తీర్చేందుకు ముందుకు రాకపోవడంపై మండిపడుతున్నారు. వాస్తవానికి జిల్లానుంచి ఫైలు వెళ్లిన తర్వాత కలెక్టర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు కొంతకాలం పర్యవేక్షణ చేశారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ అధికారులతో మాట్లాడి ప్రభుత్వం వేగంగా నిర్ణయం తీసుకునేలా చూడాలని అడిగారు. కానీ ఏడాదిన్నరగా ఫైలు కదలకపోవడంతో పట్టించుకోవడం మానేశారు. ఇటీవల మళ్లీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా చూద్దాంలే అనే ధోరణితో సమాధానం రావడంతో ప్రస్తావన తేవడం మానేశారు.

పవన్‌కల్యాణ్ పర్యటనకు.. బ్రేక్



- హెలీప్యాడ్‌వద్ద హెలీకాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతుల జారీలో అవరోధాలే కారణం
- నేటినుంచి యథావిధిగా మంగళగిరిలో సమావేశాలు

సర్పవరం జంక్షన్(కాకినాడ), ఫిబ్రవరి 14: ఉభయ గోదావరి జిల్లాల్లో జనసేనాని పవన్‌కల్యాణ్ పర్యటనకు బ్రేక్ పడింది. ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలో నాలుగురోజులపాటు పవన్ నిర్వహించాల్సిన పర్యటనకోసం ప్రభుత్వంనుంచి హెలీప్యాడ్‌వద్ద హెలీకాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతుల మంజూరులో అవరోధాల కారణంగా పర్యటన వాయిదా వేస్తున్నట్లు జనసేన పార్టీ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14 నుంచి 17 వరకు నాలుగురోజులపాటు భీమవరం, రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురంలో పవన్ పర్యటన చేపట్టేందుకు వీలుగా భద్రత, హెలీకాప్టర్ దిగేందుకు అనుమతుల కోసం అధికారులకు ఆ పార్టీ నాయకులు వినతిపత్రం అందించారు. కాకినాడలో సమావేశానికి హెలీప్యాడ్ కోసం అనుమతి కోరితే అంగీకరించలేదు సరికదా ఇక్కడకు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న గొల్లప్రోలులో హెలీకాప్టర్ దిగాల్సిన పరిస్థితులున్నాయి. కావాలనే ఉద్దేశపూర్వకంగా అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు అధికారులు ఇబ్బందులు సృష్టిస్తున్నారని భావించిన పార్టీ నాయకులు పవన్ పర్యటనను వాయిదా వేసుకోవాలని నిర్ణయించా రు. అనుమతుల విషయమై ప్రభుత్వం కలిగిస్తున్న ఆటంకాలపై న్యాయపరంగా ముం దుకు వెళ్లాలని పార్టీ లీగల్ సెల్‌కు పవన్ సూచించినట్లు హరిప్రసాద్ తెలిపారు. ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో పవన్ త్వరలో పర్యటిస్తారని, పర్యటన తేదీలను త్వరలో వెల్లడిస్తామని ఆయన స్పష్టం చేశారు.

యథావిధిగా మంగళగిరిలో సమావేశాలు

పవన్ పర్యటన వాయిదా పడినప్పటికీ మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో యథావిధిగా ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరిల్లో చేపట్టాల్సిన సమావేశాలు 15 నుంచి 17 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు హరిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్యనాయకులు, క్రియాశీలక నాయకులు, కార్యకర్తలతో పవన్ భేటీ సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ క్రియాశీలక పాత్ర, అనుసరించాల్సిన వ్యూహం, ఎన్నికల సన్నద్ధతపై పవన్ దిశానిర్దేశం చేయనున్నారని సమాచారం. ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు నియోజకర్గాల ఇన్‌చార్జులు, ముఖ్యనేతలు పయనమయ్యారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ వద్ద ప్రభుత్వ ఉద్యోగుల ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన

సర్పవరం జంక్షన్(కాకినాడ), ఫిబ్రవరి 14: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంవద్ద ప్రభుత్వ ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సమావేశం చైర్మన్ గుద్దటి రామ్మోహనరావు ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు తహశీల్దార్, ఆర్డీవో, సబ్‌కలెక్టర్, కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందిస్తామన్నారు. ఈనెల 15న, 16న మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన, 17న తాలూకా స్థాయిలో ర్యాలీ, ధర్నా, 20న ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ర్యాలీ, ధర్నా కార్యక్రమం, 21 నుంచి 24 వరకు రాష్ట్ర నాయకులు జిల్లాల పర్యటన చేస్తూ ఉద్యమ కార్యాచరణ ఉధృతం, 27న చలో విజయవాడ జయప్రదం చేయడం వంటి ఆందోళన, నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు సమావేశంలో తీర్మానించామన్నారు. ఉద్యోగులకు ఇంటీరియం రిలీఫ్ 30శాతం ఇవ్వాలని, పెండింగ్‌లో డీఏ కరువు భత్యం వెంటనే రిలీజ్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ ఎరియర్స్ క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులర్ ప్రక్రియ చేయాలన్నారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి ప్రతినెలా మొదటిరోజునే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ డీవీ రాఘవులు, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, ఉపాధ్యాయ సంఘాల నుంచి ఎన్వీయు దొరబాబు, శ్రీనివాస్, జ్యోతిబసు, ఏపీటీఎఫ్ నుంచి వెంకటరావు, టీవీ వెంకటరావు, ఏపీఎన్‌జీవో ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


కలెక్టర్ కార్యాలయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ప్రదర్శన ప్రారంభం

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 14: కాకినాడ పీఎస్‌ఆర్ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల్లో జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ప్రదర్శనను ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇన్‌స్పైర్ సహకరిస్తుందన్నారు. కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలన్నారు. అనంతరం డీఈవో పిల్లి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పట్ల ఆసక్తి పెంచుకునేలా బోధన ఉండాలన్నారు. కాకినాడ జిల్లాలోని వివిధ మండలాలనుంచి మొత్తం 131 ప్రాజెక్టులు ఇక్కడ ప్రదర్శించారన్నారు. విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలను అతిథులు తిలకించారు. కార్యక్రమంలో డీసీఈబీ వెంకట్రావు, డీఏ వాణీకుమారి, డీవైఈవో డేనియల్ రాజు, ఎంఈవోలు రవి, గణేష్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి


స్మార్ట్‌సిటీ ఫార్మ్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

సిద్ధమయ్యేది ఎలా?

రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడంపై నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోసం అన్నట్టుగా అప్పటికప్పుడే టెట్, డీఎస్సీలను నిర్వహించాలనుకోవడం, సమాయత్తం కావడానికి సరైన సమయం ఇవ్వకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తు న్నారు. పోస్టులు కూడా ఆశించిన స్థాయిలో కాకుండా తక్కువగా ఉండడంపై నిరుద్యోగులు నిరాశగా ఉన్నారు.



- ఎన్నికల వేళ హడావిడిగా డీఎస్సీ నోటిఫికేషన్
- వెనువెంటనే టెట్, డీఎస్సీల నిర్వహణకు ఏర్పాట్లు
- ఎలా సమాయత్తం కావాలంటూ నిరుద్యోగుల ఆగ్రహం
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు రకాల పోస్టులపై అస్పష్టత

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 14: గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 23వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే చంద్రబాబు కేవలం 7,902 ఉద్యోగాలకు మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి విమర్శలు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సీ పెడతామని ఆయనే హామీ ఇచ్చారు. కానీ అది నెరవేర్చకపోగా నాలుగున్నరేళ్ల తర్వాత మినీ డీఎస్సీ ప్రకటించి ఊరుకున్నారు. పైగా ఎన్నికలకు వెళ్లేటప్పుడు ప్రతిపార్టీ తన మేనిఫెస్టో విడుదల చేస్తుందని, దానిలోని ప్రతిమాటను పార్టీ నిలబెట్టుకోవాలని, అలా కాకపోతే ఆ నాయకుడు పదవికి రాజీనామా చేసి ఇంటికి వెళ్లిపోయే పరిస్థితి తీసుకురావాలని విపక్షనేత హోదాలో అప్పట్లో యువతను ఉద్దేశించి జగన్ అన్నారు. ఆయనకు ఇవేమీ వర్తించవా అని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు చెప్పిన మాటలకు, నేడు సీఎం జగన్ చేస్తున్న చేతలకు పొంతన లేకుండా పోయిందని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా ఒక్కసారి కూడా డీఎస్సీ నిర్వహించకుండా ఇప్పుడు ఎన్నికల వేళ హడావిడిగా నోటిఫికేషన్ ఇచ్చారని విమర్శిస్తున్నారు.

సమయం తక్కువ

గత టీడీపీ ప్రభుత్వం డీఎస్సీ-2014లో 10,313 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసింది. 2018లో 7,902 ఉపాధ్యాయ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి ఎంపిక ప్రక్రియ చేపట్టింది. కోర్టు కేసులతో పెండింగ్ పడడంతో వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిలో 7,254 ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసింది. డీఎస్సీ-2018పై ఎన్నికల సమయంలో విపక్ష నేతగా ఉన్న జగన్ విమర్శలు గుప్పించారు. పాఠశాల విద్యలో 23వేల ఖాళీలున్నాయంటూ నిరుద్యోగులపై అప్పట్లో ప్రేమ కురిపించారు. కానీ సీఎంగా అధికారం చేపట్టాక ఉన్న పోస్టులను జీవో 117తో సర్దుబాటు చేయగా మరికొన్నింటిని రద్దు చేశారు. ప్రస్తుతం ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీకి తగినంత వ్యవధి ఇవ్వకుండా తక్కువ సమయంలో టెట్, డీఎస్సీలను నిర్వహించాలనుకోవడంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ రెండు పరీక్షలకు సిలబస్‌లు వేర్వేరు కావడంతో వాటి నిర్వహణ మధ్య కాస్త సమయం ఉండాలని కోరుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందన్న యోచనతో వెనువెంటనే టెట్, డీఎస్సీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుండడంపట్ల నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు.

ఒకేసారి రెండు పరీక్షల నిర్వహణ

టెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మాత్రమే డీఎస్సీకి అర్హులు. ఉపాధ్యాయ నియామకాల్లో టెట్‌లో వచ్చిన మార్కులకు 20శాతం వెయిటేజీ ఉంటుంది. దీనివల్ల డీఎస్సీ అభ్యర్థులకు టెట్ అత్యంత కీలకం. టెట్‌కు ఈనెల 8నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా ఈగడువు 18తో ముగియనుంది. దీనికి సంబంధించిన రాతపరీక్షలను ఈనెల 27నుంచి మార్చి 9 వరకూ నిర్వహించనున్నారు. ఫలితాలను 14న విడుదల చేస్తారు. కానీ మరుసటిరోజు అంటే 15నుంచే డీఎస్సీ పరీక్ష ప్రారంభం కానుంది. దీంతో ఒకేసారి రెండు పరీక్షలను రాసేందుకు ఎలా సిద్ధం కావాలో తెలియడంలేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా టెట్ ఫలితాలు వెలువడిన తర్వాత మాత్రమే డీఎస్సీ పరీక్ష షెడ్యూల్ ఖరారు చేస్తారని,టెట్, డీఎస్సీ రెండింటి నిర్వహణ మధ్య కనీసం 40రోజుల వ్యవధి ఉండాలని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలవారీగా సంప్రదింపులు ఏవీ

రాష్ట్రవ్యాప్తంగా 6100 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయగా వాటిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 392 ఉద్యోగాలుండగా ఎస్టీటీలు 108, స్కూల్ అసిస్టెంట్‌లు 182, టీజీటీలు 102 పోస్టులు ఉన్నాయి. జిల్లాలో పీజీటీ, ప్రిన్సిపాల్ పోస్టులు కూడా ఉండగా ఇవి ఎన్ని ఉన్నాయో నేటికీ స్పష్టత లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు సబ్జెక్టులవారీగా ఎన్ని ఉన్నాయో నోటిఫికేషన్‌లోగానీ, సంబంధిత వెబ్‌సైట్‌లోగానీ వివరాలను పొందుపరచలేదని, దీంతో తామంతా ఆందోళనకు గురవుతున్నామని నిరుద్యోగులు వాపోతున్నారు. సాధారణంగా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చే ముందు రాష్ట్రంలోని అన్ని జిల్లాలనుంచి విద్యాశాఖలోని వివిధ విభాగాల్లో ఖాళీలను పంపించమని సంబంధిత విద్యాశాఖాధికారులను ఆదేశిస్తుంది. ఆ విధంగా అన్ని జిల్లాలనుంచి వచ్చిన ఖాళీలను కలిపి నోటిఫికేషన్ ఇస్తుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలలకు సంబంధించి ఎస్జీటీ 42, స్కూల్ అసిస్టెంట్ తెలుగు 44, హిందీ 7, ఇంగ్లీష్ 38, గణితం 15, పీఎస్ 4, బయోలాజికల్ సైన్స్ 15, సోషల్ స్టడీస్ 12, ఫిజికల్ ఎడ్యుకేషన్ 46 పోస్టులు ఉన్నట్లు సమాచారం. సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, ఏపీ రెసిడెన్షియల్ తదితర సొసైటీలకు సంబంధించిన పాఠశాలల టీజీటీ, పీజీటీ ఖాళీల వివరాలు తెలియాల్సి ఉంది.

ఓట్ల తొలగింపులో అపోహలకు తావులేకుండా చర్యలు: కలెక్టర్

సర్పవరం జంక్షన్(కాకినాడ), ఫిబ్రవరి 14: ఓట్ల తొలగింపులో ఎటువంటి అపోహలకు తావు లేకుండా పారదర్శకంగా చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. కలెక్టరేట్‌లో సాధారణ ఎన్నికలు-2024పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం ఆమె నిర్వహించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా-2024లోని అంశాలు, మార్పులు, చేర్పులు, 18-19ఏళ్ల మధ్య వయసుగల యువతీయువకులకు ఓటు నమోదు, పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు, ఎపిక్ కార్డుల పంపిణీపై వివరించారు. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు, ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ద్వారా ఓటింగ్‌పై నిర్వహిస్తున్న అవగాహన సమావేశాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఎన్నికల ప్రక్రియ చేపడుతున్నామన్నారు. సమావేశంలో డీఆర్వో డి.తిప్పే నాయక్, వైసీపీ తరపున రావూరి వెంకటేశ్వరరావు, బీజేపీ తరపున రవికిరణ్, టీడీపీ నుంచి గదుల సాయిబాబా, బీఎస్పీనుంచి ఎస్.అప్పారావు, సీపీఎం నుంచి కె.వీరబాబు, ఆప్ నుంచి కాళ్లూరి కృష్ణమోహన్, ఎన్నికల విభాగం డీటీ ఎం.జగన్నాథం పాల్గొన్నారు.



రాజకీయపార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ
- 21మందికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- తుని రూరల్ వి.కొత్తూరు కూడలివద్ద ఘటన

- 7లో

ఇర్రిపాకలో వైభవంగా ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ - 7లో

దళిత సర్పంచ్‌కు అవమానం - 7లో

చుక్కలు చూపిస్తున్న వెల్లుల్లి - 7లో

మహాశివరాత్రి ఏర్పాట్లకు శ్రీకారం


పందిరి రాట ముహూర్తం చేస్తున్న దృశ్యం

పిఠాపురం, ఫిబ్రవరి 14: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఆలయంలోని రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ పులి నారాయణమూర్తి పందిరిరాట ముహూర్తం చేశారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో తెలిపారు.

వసంతపంచమి వేడుకలు

పాదగయ క్షేత్రంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. సరస్వతి దేవికి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చుక్కలు చూపిస్తున్న వెల్లుల్లి

కిలో రూ.360 నుంచి రూ.400



సామర్లకోట, ఫిబ్రవరి 14: సామాన్యులకు ఉల్లిధరలు ఊరటనిస్తుంటే వెల్లుల్లి ధరలు మాత్రం చుక్కలు చూపిస్తున్నాయి. కొంతకాలంగా కిలో రూ. 20 నుంచి రూ. 35 వరకూ విక్రయించిన ఉల్లి ధరలు తగ్గుముఖం పడుతుంటే వెల్లుల్లి ధరలు మాత్రం రూ. 300 నుంచి రూ. 360 వరకూ పలుకుతుండగా మరీ ప్రత్యేక రకం వెల్లుల్లి మాత్రం బుధవారం సామర్లకోట, పెద్దాపురం మార్కెట్లలో కిలో రూ. 400 వరకూ పలికింది. గత నెల చివరి వరకూ కిలో వెల్లుల్లి రూ. 200 వరకూ విక్రయించగా ఒక్కసారిగా రూ 360 నుంచి రూ. 400 వరకూ అమాంతంగా పెరిగింది. దీంతో సామాన్యులే కాదు ధనికులు సైతం వామ్మో అంటున్నారు. సామాన్యులు వెల్లుల్లి మాట ఎత్తాలంటేనే భయపడిపోతున్నారు. రాబోయే వేసవిలో పచ్చడి పెట్టేందుకు ఎక్కువగా ఉపయోగించే వెల్లుల్లి ధర పెరగడంతో పచ్చడి ప్రియులకు ఆందోళన కలిగిస్తోంది. వెల్లుల్లి పంట ఈ ఏడాది బాగా తగ్గినట్లు హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. గత అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ బంగ్లాదేశ్‌తో పాటు ఉత్తరాది రాష్ట్రాలలో వరదలకు వెల్లుల్లి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తెలుగు రాష్ట్రాలలో ఈ పంట లేకపోవడం, దిగుమతులు తగ్గడంతో వెల్లుల్లికి సహజంగానే డిమాండ్ పెరిగింది. ఇదే పరిస్థితి కొనసాగితే ధర మరింత పైపైకి ఎగబాకే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

రత్నగిరిపై పలు అభివృద్ధి పనులకు ఆమోదం

- రూ.46.75 లక్షలతో సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవ పనులు
- రూ.25.50 లక్షలతో కోరుకొండ కల్యాణోత్సవ పనులు
- రత్నగిరిపై దాతలకు ప్రత్యేక సౌకర్యాల కల్పనకు గ్రీన్‌సిగ్నల్
- రూ.60 లక్షలతో కోరుకొండ మెట్లమార్గం అభివృద్ధి పనులపై చర్చ
- అంతరాలయ దర్శన టిక్కెట్ల రేట్లు మార్పు నిర్ణయం వాయిదా


పాలకమండలి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, ఫిబ్రవరి 14: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో పలు అభివృద్ధి పనులకు బుధవారం పాలకమండలి ఆమోదం తెలిపింది. ఛైర్మన్ ఐ.వి రోహిత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై సభ్యులు, ఈవోతో చర్చించి ఆమోదం తెలిపారు. ప్రధానంగా సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవాలకు వివిధ ప్రాంతాల్లో రంగులు, షామియానాలు ఏర్పాటు, విద్యుద్దీప అలంకరణలకు రూ.46.75 లక్షలతో తయారుచేసిన అంచనాలను ఆమోదించారు. స్వామివారి సన్నిధిలో అన్నదానం, వివిధ పథకాలకు విరాళం అందించిన దాతలకు ప్రత్యేక సౌకర్యాల కల్పనకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు విరాళమిచ్చిన వారికి 10 ఏళ్లపాటు ఏడాదిలో వారి కుటుంబసభ్యులకు రెండు పర్యాయాలు ప్రత్యేక దర్శనం, వసతి సౌకర్యం కల్పించాలని రూ.10లక్షల పైబడి విరాళమిచ్చే దాతలకు 15 ఏళ్ల పాటు సౌకర్యాలు కల్పించాలని వీరికి ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని నిర్ణయించారు. నూతనంగా తయారవుతున్న టేకు రథం నిలుపుప్రదేశం పీఏసీకి మార్చాలని తీర్మానించారు. రూ.26 లక్షలతో వనదుర్గ మార్గ్ వద్ద మట్టి పూడ్చి గాబియన్ వాల్ నిర్మాణం, రూ.6.30 లక్షలతో ఆదిశంకర్ మార్గ్ వద్ద డ్రైయిన్, కొండకు మధ్య మట్టిపూడ్చడం, సత్యగిరి నుంచి గిరి ప్రదక్షిణ రోడ్డు తాత్కాలికంగా నిలుపుదల చేసి రూ.4.50 లక్షలతో ఎర్త్ ఫిల్లింగ్, సత్యగిరి జంక్షన్ నుంచి హరిహరసదన్ కచ్చారోడ్డు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.9.50 లక్షలు, రూ.18 లక్షలతో ఇటీవల అన్నవరం దేవస్థానానికి అప్పగించిన కిర్లంపూడి సత్రం రంగులు, ఇతర అభివృద్ధి పనులకు, రూ.11.50 లక్షలతో సహజ వెనక భాగంలో నిర్మించిన డార్మెటరీకి మిగిలిన పనులు, రూ.8.50 లక్షలతో సత్యగిరిపై మూడో క్యాంటీన్ నిర్మాణ పనులు, రూ.13.50 లక్షలతో పశ్చిమరాజగోపురం వద్ద 30 వీఐపీ కూల్చిన ప్రదేశంలో రిటైనింగ్‌వాల్ నిర్మాణం, కొండ దిగువ రూ.17.50 లక్షలతో మహిళలకు మరుగుదొడ్లు, చైల్డ్‌లింక్ మెస్ ఏర్పాటు తదితర పనుల అంచనాలను ఆమోదించారు. ప్రసాద్ స్కీం నిధుల ద్వారా అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించగా ఆమోదించారు. రూ.40 లక్షలతో స్టెయిన్‌లెస్ స్టీల్ బెంచీలు, క్యూలైన్‌ల ఏర్పాటుకు అంగీకారం లభించింది. ప్రస్తుతం అమలవుతున్న రూ.300 అంతరాలయ టిక్కెట్ దర్శనం ధర మార్పుపై నిర్ణయాన్ని వచ్చే సమావేశానికి వాయిదా వేశారు. మార్చి 19 నుంచి 25 వరకు జరిగే కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాలలో వివిధ పనులకు రూ.25.50 లక్షలు ఖర్చు చేసేందుకు ప్రతిపాదించగా ఆమోదం లభించింది. ఇటీవల పలు వ్యాపార లైసెన్స్ హక్కులకు నిర్వహించిన బహిరంగ వేలంలో హెచ్చుపాటలను, అభివృద్ధి పనులకు పిలిచిన టెండర్లలో లోయస్ట్ టెండర్లను ఆమోదించారు. సమావేశంలో ఈవో రామచంద్రమోహన్, సభ్యులు పేరూరి బద్రీనారాయణ, దోమాడ సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇర్రిపాకలో వైభవంగా

ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ


జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న నెహ్రూ, స్వామీజీలు

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి14: జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలోని ఏలేరు నది తీరాన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 12 ద్వాదశ జ్యోతిర్లింగాలకు జ్యోతుల నెహ్రూ-మణి దంపతులు, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతులు, సర్వారాయుడు, సునీత దంపతులచే యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకినాడ శ్రీ పీఠం పీఠాధిపతి స్వామి పరిపూర్ణానందస్వామి చేతుల మీదుగా ద్వాదశ జ్యోతిర్లింగ ప్రతిష్ఠాపన చేశారు. శ్రీ పీఠం పరిపూర్ణానంద స్వామి జ్యోతిర్లింగాలు ప్రతిష్ఠ చేసి జ్యోతుల నెహ్రూ, నవీన్ దంపతులచే శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ పీఠం పరిపూర్ణానంద స్వామి మాట్లాడుతూ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ ఎంతో విశిష్టమైనదన్నారు. నది ఒడ్డున సాక్షాత్తు మహా శివుడే కొలువైనట్లు ఉందన్నారు. ఇక నుంచి ప్రజా సందర్శనతో దివ్యక్షేత్రంగా ఈ జ్యోతిర్లింగాల ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ సాక్షాత్తు ఆ పరమశివుని ఆశీస్సులతోనే ఇంతటి మహా కార్యక్రమాన్ని చేపట్టగలిగానని ఏలేరు నది పక్కన నిర్మించిన ఈ జ్యోతిర్లింగాల క్షేత్రాన్ని ప్రజలు నిత్యం సందర్శించుకునేందుకు అన్ని రకాల ఏర్పాట్లను చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి నిత్యం పండితులతో అభిషేక కార్యక్రమాలు జరిపించనున్నట్లు చెప్పారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ మార్చి మొదటి వారంలో ఈ మహాయజ్ఞం కార్యక్రమం పూర్తవుతుందన్నారు. భక్తులందరూ ఈ ద్వాదశ శివలింగాలను దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెలాఖరున జరిగే మహాకుంభాభిషేకంకు రాష్ట్రంలో నుంచి ప్రముఖులు వస్తారన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నవీన్ తెలిపారు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ, యనమల కృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, రాజప్ప తనయుడు రంగనాథ్, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, పేరాబత్తుల రాజశేఖర్, పెద్దాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు హాజరై జ్యోతిర్లింగాల దర్శనం చేసుకున్నారు. భక్తులు తరలి వచ్చి జ్యోతిర్లింగాల దర్శనం చేసుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

నకిలీ నెయ్యి తయారీ గుట్టురట్టు

- విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారుల సంయుక్త దాడులు
- రూ.7 లక్షల ముడి సరుకు సీజ్
- స్వీట్స్ తయారీ అనుమతులతో కల్తీ నెయ్యి తయారీ


బకెట్లలో నకిలీ నెయ్యి

అనపర్తి, ఫిబ్రవరి 14: మార్కెట్‌లో లభించే ఏ సరుకు కొనాలో, ఏది అసలో ఏది నకిలీనో తెలియని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మార్కెట్‌లో లభించే నెయ్యి కొంత తక్కువ ధరకు విక్రయించేందుకు ఒక వ్యాపారి నకిలీని ఎన్నుకున్నాడు. వెన్న లేకుండానే టన్నుల నెయ్యిని తయారు చేసి విక్రయాలు సాగిస్తున్నాడు. అనపర్తి మండలం పొలమూరులో వరి పొలాలకు ఆనుకుని గ్రామానికి చెందిన తమలంపూడి రాజారెడ్డి స్వీట్స్ తయారీ పేరుతో కార్ఖానా ఏర్పాటు చేసి రెండేళ్లుగా నకిలీ నెయ్యి తయారు చేస్తూ విక్రయాలు సాగిస్తున్నాడు. తయారు చేసిన కొంత భాగాన్ని ఒడిసాకు తరలిస్తుండగా కొంత భాగాన్ని ఇక్కడ రిటైల్ మార్కెట్‌లో విక్రయిస్తున్నాడు. మార్కెట్‌లో లభ్యమైన నకిలీ నెయ్యి డబ్బాపై ఎటువంటి నిర్దిష్టమైన ప్రచురణలు లేకపోవడంతో విజిలెన్స్ అధికారులు తయారీ కేంద్రంపై దృష్టి సారించారు. బుధవారం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నకిలీ నెయ్యి తయారీకి వినియోగించే సన్‌ఫ్లవర్ ఆయిల్, వనస్పతి, పామాయిల్, జాబిలాల సీడ్స్, ఆర్టిఫిషియల్ ఫ్లేవర్‌తో ధనేశ్వరి బ్రాండ్‌పై నకిలీ నెయ్యి తయారు చేస్తున్నట్టు గుర్తించారు. నకిలీ నెయ్యి తయారీకి వినియోగించే సుమారు రూ.7 లక్షల విలువైన ముడి సరుకును సీజ్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ముత్యాల నాయుడు మాట్లాడుతూ నకిలీ నెయ్యి తయారీ చేస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. స్వీట్ తయారీ పేరుతో అనుమతులు తీసుకుని నకిలీ నెయ్యి తయారు చేస్తున్నట్లు గుర్తించామని, సుమారు టన్ను నకిలీ నెయ్యి స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సిద్ధి పేరుతో నకిలీ నెయ్యి తయారు చేస్తున్న రాజారెడ్డిపై కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. తయారీ కేంద్రంలో సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు తరలిస్తున్నామని నివేదిక ప్రకారం క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. జిల్లా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజు మాట్లాడుతూ ప్యాకింగ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కాటాపై సీల్, ప్యాకింగ్‌పై కస్టమర్ కేర్ నెంబరు ముద్రించి ఉండాలని ఈ మూడు నిబంధనలను పాటించక పోవడంతో మూడు కేసులు నమోదు చేశామన్నారు. విజిలెన్స్ సీఐ నాగేంద్రకుమార్, ఎస్‌ఐ జగన్నాథరెడ్డి, డీటీ శశిధర్ పాల్గొన్నారు.

అంతర్వేది ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అంతర్వేది, ఫిబ్రవరి 14: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాల నిర్వహణపై కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం సమీక్షించారు. తొలుత ఆయన ఎస్పీ ఎస్.శ్రీధర్‌తో కలిసి కల్యాణ మండపం, రథోత్సవం, 16 స్తంభాల మండపం, షెడ్లు, బస్టాండు, తీర్థయాత్ర సందర్శకుల ప్రదేశాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది ఉత్సవాలను సమన్వయంతో ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో అధికారులందరూ భక్తిశ్రద్ధలతో విధులు నిర్వర్తిస్తూ సేవలందించాలన్నారు. ప్రధానంగా 19వ తేదీ రాత్రి 12.29 గంటలకు స్వామివారి కల్యాణం, 20వ తేదీ మధ్యాహ్నం రథోత్సవం, 24న చక్రస్నానం, 25వ తేదీ సాయంత్రం తెప్పోత్సవం వైభవంగా జరిగేలా చూడాలన్నారు. రథోత్సవం జరిగే ప్రాంతంలో ఎటువంటి దుకాణాలులేకుండా పోలీసులు, దేవదాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు విశ్రమించేందుకు ఏర్పాటు చేసిన వసతులను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. శాఖల వారీగా అధికారులు తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. ఈ సంవత్సరం సుమారు 3 నుంచి 4లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారన్నారు. ఉత్సవాలు జరిగే ప్రాంతంలో మెరుగైన పారిశుధ్య చర్యలు చేపట్టారు. స్నానాలు చేసే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, వాచ్ టవర్లు, మైక్ సెట్‌లు, సముద్ర తీర ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేసి నీటి సరఫరా ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలని, టాయిలెట్లను ప్రతి మూడుగంటలకొకసారి శుభ్రపరిచేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తెప్పోత్సవం జరిగే సమయానికి ఆలయ ప్రాంగణంలో ఉన్న చెరువులో నీటిని నింపాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. సముద్ర స్నానం చేసేటప్పుడు భక్తులు కెరటాల బారిన పడకుండా రక్షణకు గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. అత్యవసర సమయంలో వైద్యం అందించేందుకు ఆరు మెడికల్ క్యాంపులను, రెండు అంబులెన్సులను అందుబాటులో ఉంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం తగినన్ని బస్సులను అంతర్వేదికి నడపాలని ఆర్టీసీ అధికారులను కోరగా 120 బస్సులు ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. నిర్విరామంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, స్వామివారి కల్యాణం జరిగే సమయంలో బ్యాకప్ కింద జనరేటర్లు అందుబాటులో ఉంచాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. పది రోజుల పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో మద్యం, మాంసం దుకాణాలు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెండు అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి బందోబస్తు కోసం వస్తున్న సిబ్బందికి, వైద్య సిబ్బందికి స్కూళ్లల్లో వసతి ఏర్పాటు చేయాలని విద్యాశాఖాధికారులకు సూచించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటున్న కారణంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం చుట్టుపక్కన ఉన్న హోటల్, లాడ్జిల్లో అధిక మొత్తంలో అద్దె వసూలు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని పర్యాటక శాఖ అధికారులకు సూచించారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ కల్యాణ మహోత్సవాల్లో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఐదు జిల్లాల నుంచి 1,600 మంది పోలీసు సిబ్బందిని తీసుకొస్తున్నామన్నారు. ట్రాఫిక్ సమస్యలు, తోపులాటలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని, వన్‌వే రూట్‌లో భక్తులు సురక్షితంగా వెళ్లాలన్నారు. రథోత్సవం రోజున రథం వెళ్లే ప్రాంతాల్లో షాపులకు అనుమతులు లేవన్నారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ కల్యాణోత్సవాలకు వచ్చే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతోందని, దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులంతా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వన్‌వే రూట్ ఉండడం వల్ల స్థానికంగా ఉన్న భక్తులు, వారి బంధువుల ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో ఉప కమిషనర్ విజయరాజు, జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్‌ఐ ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ


21 మందికి గాయాలు..ఒకరి పరిస్థితి విషమం


సంఘటన స్థలంలో ప్రమాద దృశ్యం

తుని రూరల్, ఫిబ్రవరి 14: 16వ నెంబరు జాతీయ రహదారిపై తుని రూరల్ వి.కొత్తూరు కూడలి వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీ కొట్టిన ఘటనలో 21 మంది గాయాలపాలయ్యారు. రాజమహేంద్రవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అక్కడి నుంచి తునికి వచ్చే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. హైవే రోడ్డు నుంచి తుని సర్వీసు రోడ్డుకు మళ్ళే క్రమంలో వి.కొత్తూరు కూడలి వద్ద బెంగాల్ నుంచి కేరళ వెళుతున్న లారీ ఆర్టీసీ బస్సును బలంగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో లారీ డ్రైవర్‌తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న 20 మంది గాయాలపాలయ్యారు. భారీ శబ్దంతో లారీ ఢీకొనడంతో ఒక్కసారిగా ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. రోదనలు మిన్నంటాయి. స్థానికులతో పాటు సమీప రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది హుటాహుటిన చేరుకుని బస్సులో ఇరుక్కున్న ప్రయాణికులను బయటకు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. గాయపడ్డ 21 మందిని 108లో తుని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కిర్లంపూడి మండలం వేలంకి గ్రామానికి చెందిన ఐతా అప్పలరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించారు. వివాహ శుభకార్యాలు ఎక్కువగా ఉండటంతో బస్సులో ప్రయాణిస్తున్న వారు శుభకార్యాలకు వెళుతున్నట్టు ప్రయాణికులు చెబుతున్నారు. సంఘటన స్థలంతో పాటుగా ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని తహసీల్దార్ భరత్‌రెడ్డితో పాటు రూరల్ సీఐ పరామర్శించారు. రూరల్ ఎస్‌ఐ డి.రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దళిత సర్పంచ్‌కు అవమానం

- సమాచారం ఇవ్వకుండానే పంచాయతీ సమావేశం
- కార్యాలయం ఎదుట సర్పంచ్ నిరసన


కార్యాలయం వద్ద ఆందోళన

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 14: పిఠాపురం మండలం నవఖండ్రవాడలో దళిత మహిళా సర్పంచ్‌కు అవమానం జరిగింది. తనకు సమాచారం ఇవ్వకుండానే పంచాయతీ సమావేశం నిర్వహించి తీర్మానాలు నమోదు చేయడంపై సర్పంచ్ నిరసనకు దిగారు. నవఖండ్రవాడ సర్పంచ్ బళ్ల రజనీవాణి వైసీపీలో జరుగుతున్న అవమానాలు భరించలేక కొంత కాలం క్రితం తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పటి నుంచి ఆమెకు అధికారులు నుంచి సహాయ నిరాకరణ ఎదురవుతున్నది. నవఖండ్రవాడ గ్రామపంచాయతీ సమావేశాన్ని ఈ నెల 8వ తేదీన ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి వార్డు సభ్యులు ఎవ్వరు హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా పడింది. తిరిగి బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. వార్డు సభ్యులందరికి నోటీసులు ఇచ్చి తనకు సమావేశం నోటీసు ఇవ్వలేదని సర్పంచ్ బళ్ల రజనీవాణి తెలిపారు. సర్పంచ్ హాజరు కాలేదని సాకు చూపించి అభివృద్ధి పనుల నిర్వహణకు గానూ విలేజీ లెవెల్ కమిటీ ఏర్పాటుకు సమావేశంలో తీర్మానం చేశారని చెప్పారు. దళిత సర్పంచ్ అయిన తనను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కావాలనే అవమానిస్తున్నారని ఆరోపిస్తూ అతనిపై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేసి విధులు నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ రజనీవాణి తన భర్తతో కలిసి పిఠాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం మధ్యాహ్నం ఆందోళనకు దిగారు. ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు ఆదేశాల మేరకు తనను పంచాయతీ కార్యదర్శితో పాటు అధికారులు అవమానానికి గురిచేస్తున్నారని సర్పంచ్ బళ్ల రజనీవాణి తెలిపారు. వార్డు సభ్యుల వద్ద పంచాయతీ రికార్డులు ఉంచి ఆ నెపం తనపై వేసి సర్పంచ్ పదవిని నుంచి తొలగించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రెండేళ్లుగా తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. దళిత సర్పంచ్ అయిన తనను వేధిస్తున్న పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసి అతనిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా సర్పంచ్ ఆరోపణలపై విచారణ జరుపుతామని ఎంపీడీవో చిన్నారావు తెలిపారు.

సిద్ధి వినాయక ఆలయం కిటకిట


స్వామివారి వద్ద కలాలను ఉంచి పూజ

అయినవిల్లి, ఫిబ్రవరి 14: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం మాఘ పంచమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. గణపతి పూజ, సరస్వతి కల్పం, సరస్వతి మండపారాధన, సరస్వతి హోమం నిర్వహించారు. లక్ష కలాలను స్వామివారి పాదాల చెంతన ఉంచి పూజ చేశారు.

అన్నప్రసాద భవన నిర్మాణానికి రూ.10 లక్షలు


దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 14: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి బుధవారం నంది గామకు చెందిన కోవెలమూడి వెంకటనారాయణ వసంత సంధ్యారాణి దంపతులు రూ.10 లక్షలు విరాళం సమర్పించారు. మహారాజ పోషకులకు ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో మన్యం భాను, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అయినవిల్లి, ఫిబ్రవరి 14: అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని విజయవాడకు చెందిన బండారు కృష్ణప్రసాద్-అరుణకుమారి దంపతులు కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. దాతను శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటాన్ని దేవస్థానం ఛైర్మన్ గుత్తుల నాగబాబు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు అందజేశారు.

ఐక్యతతో పనిచేస్తే కాంగ్రెస్ బలోపేతం

ఐదు జిల్లాల నేతలతో మాణిక్‌రాకూర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14: అందరు ఐక్యతతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఏపీ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి, ఎంపీ మాణిక్ ఠాకూర్ సూచించారు. కాకినాడ, రాజమహేంద్రవరం, భీమవరం, ఏలూరు, అమలాపురం జిల్లాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, నాయకులతో రాజమహేంద్రవరం పేపరుమిల్లు సమీపంలోని కృష్ణసాయి కల్యాణ మండపంలో బుధవారం సమావేశం నిర్వహించారు. సీడబ్ల్యూసీ సభ్యుడు రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరిగే ఎన్నికలకు బూత్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవడం, పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేసుకోవడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఏఐసీసీ సెక్రటరీ సీడీ మియ్యప్ప, ఏఐసీసీ శాశ్వత సభ్యుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ముళ్ళ మాధవ్, నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, రాజమహేంద్రవరం ఇన్‌చార్జి బోడా వెంకట్, అనపర్తి ఇన్‌చార్జి వడయార్, కోనసీమ జిల్లా అధ్యక్షుడు కామర ప్రభాకరరావు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు పాండురంగారావు, నర్సాపురం అధ్యక్షుడు నార్నిడి బాబ్జి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమావేశంలో ఘర్షణ

రాజమహేంద్రవరం ఇన్‌చార్జి బోడా వెంకట్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. నగరంలో ఇటీవల నిర్వహించిన ఒక కార్యక్రమానికి సంబంధించి అంశం అక్కడ లేవనెత్తడంతో బోడా వెంకట్, బాలేపల్లి మురళీధర్ కు మధ్య వాగ్వాదం జరిగింది. అది కాస్త ఘర్షణకు దారి తీసింది. ఈ సంఘటనలో బాలేపల్లి మురళీధర్ దవడకు గాయం కావడంతో వెంటనే కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు వైద్యచికిత్స అందించారు. తనపై బోడా వెంకట్ దాడి చేశాడని బాలేపల్లి మురళీధర్ ప్రభుత్వాసుపత్రి అవుట్ పోస్టులో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేశవరం వేదికపై వేగుళ్ల, తోట

కేశవరంలో గెలుపొందిన వారే ఎమ్మెల్యేగా నిలబడాలని ప్రతిన


మాట్లాడుతున్న తోట, వేగుళ్ల

మండపేట, ఫిబ్రవరి 14: మండపేటలో రాజకీయం వేడుక్కుతోంది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎన్నికలకు ముందే పోటీకి సై అంటే సై అంటున్నారు. ఇటీవల ఇద్దరు నేతలూ మండపేట మం డలం కేశవరం గ్రామాన్ని యూనిట్ గా ఎంపిక చేసుకుని పోటీకి సిద్ధమని వేర్వేరుగా ప్రకటనలు చేశారు. దానికి కట్టుబడి ఉన్నామని బుధవారం ప్రకటించారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలోని ఎమ్మెల్సీ తోట చాంబర్‌లో ఇద్దరు నేతలూ కేశవరంలో జరిగే ఎన్నికకు సంబంధించి విధి విధానా లను రూపొందించి మీడియా సమక్షంలో ఎన్నిక నిర్వహించాలని సూచించారు. ఇద్దరం పోటీకి సిద్ధమని... కేశవరంలో ఎవరు ప్రజా బలంతో గెలుపొందితే వారే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయాలని, ఈ విషయాన్ని తమ పార్టీ నేతలతో ప్రకటన చేయిస్తామని వెల్లడించారు. నియోజకవర్గంలో 42 గ్రామాలు, మున్సిపాలిటీ ఉండగా కేవలం కేశవరాన్నే ఎందుకు ఎంచుకున్నారని విలేకరులు ప్రశ్నించారు. గత మూడు ఎన్నికల నుంచి అక్కడ టీడీపీకి మెజారిటీ వచ్చిందని... అక్కడ తాను అవినీతికి పాల్పడ్డానని ఎమ్మెల్యే వేగుళ్ల వ్యాఖ్యానించిన నేపథ్యంలో తాను కేశవరంలో ప్రజా తీర్పు కోరుకుంటున్నానని తోట చెప్పారు. అక్కడి ప్రజలు ఇచ్చే తీర్పునకు తామిద్దరం కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఎప్పుడు పోటీ నిర్వహించాలో తర్వాత వెల్లడిస్తామన్నారు.

వేలంపాట ద్వారా రూ.23.32 లక్షల ఆదాయం

పెద్దాపురం, ఫిబ్రవరి 14 : మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ దేవస్థానంలో నిర్వహించిన బహిరంగ వేలంపాటల ద్వారా రూ. 23,32762. ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈవో టీవీ సూర్య నారాయణ తెలిపారు. అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్క రించుకుని కొబ్బరిచెక్కలు, చీరలు, ఎనుపోతులు వాటిని పోగుచేసుకునే నిమిత్తం ఈవేలం పాటలను నిర్వహించామన్నారు.

పలువురు టీడీపీలో చేరిక



పార్టీ కండవా కప్పి ఆహ్వానిస్తున్న కృష్ణుడు

తొండంగి, ఫిబ్రవరి 14: వైసీపీకి చెందిన దానవాయి పేట పంచాయతీ వార్డు మెంబరు చొక్కా రామకృష్ణ ఆ పార్టీకి రాజీనామాచేసి తెలుగు దేశం పార్టీలో చేరారు. బుధవారం ఒంటిమామిడి పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు పార్టీ కండవా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పైడికొండ గ్రామ వైసీపీకి చెందిన జామి గంగాధర్, మురమళ్ల నాగు, స్వయంబరపు సూరిబాబు, చిన్నా, అప్పన్న, చంటిబాబు లోవరాజు, శ్రీను సత్తిబాబుతోసహా భారీసంఖ్యలో టీడీపీలో చేరగా వారికి కృష్ణుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పేకేటి హరికృష్ణ, జిల్లా మత్స్యకార అధ్యక్షుడు కోడ వెంకటరమణ, పార్టీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, మాజీ జడ్పీటీసీ చొక్కా కాశీశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో 100 కుటుంబాలు చేరిక



టీడీపీలోకి చేరిన వైసీపీ కార్యకర్తలు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి14: ఏలేశ్వరం నగర పంచాయతీ 1వ వార్డులో బుధవారం వైసీపీకి చెందిన 100 కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరాయి. పంచదారల చిన్న ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరిన వారందరికీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కౌన్సెలర్లు బొదిరెడ్డి గోపాలకృష్ణ,మూది నారాయణ స్వామి, ఎంపీపీ గొల్లపల్లిబుజ్జి, నాయకులు సూదిబూరయ్య, చిక్కాల లక్ష్మణరావు, కొప్పుల బాబ్జి, కోనాల వెంకటరమణ, పెండ్ర శ్రీను, బసవ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

● టీడీపీ అధికారప్రతినిధి వర్మ



మాజీ ఎమ్మెల్యే వర్మకు బూడిద గుమ్మడి కాయలతో దిష్టితీస్తున్న మహిళలు

ఇసుకపల్లి(కొత్తపల్లి) ఫిబ్రవరి 14: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీ బస్సుల్లో ఆడపడుచులకు ఉచిత ప్రయాణం అమలు చేసేందుకు చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి ఎస్వీఎస్ఎన్‌వర్మ అన్నారు. పాత ఇసుకపల్లిలో టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వర్మను ఆడపడుచులు బూడిద గుమ్మడికాయలపై హారతికర్పూరం వెలిగించి దిష్టితీశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చెరుకూరి చంటి రాజు, నడింపల్లి సత్యనారాయణరాజు, వెంకటేశ్వరరాజు, టీడీపీ కొత్తపల్లి మండలశాఖ అధ్యక్షులు అనిశెట్టి సత్యానందరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చినరాజప్పకు పలువురి అభినందన



లక్ష్మీగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, ఫిబ్రవరి 14: పెద్దాపురం నియోజకవర్గం నుంచి మూడోసారి తెలుగుదేశం పార్టీ తరపున పోటీచేసేందుకు అధికారికంగా ఖరారు కావడంతో ఎమ్మెల్యే చినరాజప్పను సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు అభినం దించారు. ఇప్పటికే నియోజకవర్గంలో పర్యటించిన పార్టీ అధినేత చంద్రబాబు ఎమ్మెల్యే చినరాజప్ప పేరును ప్రకటించిన విషయం విదితమే. మూడవ దఫా కూడా చినరాజప్ప తెలుగుదేశం పార్టీ తరపున పోటీచేస్తారని అధికారికంగా సమాచారం రావడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా తన గెలుపు కాంక్షిస్తూ ఎమ్మెల్యే చినరాజప్ప బుధవారం సామర్లకోట మెహెర్ కాంప్లెక్స్ వద్ద ఉన్న లక్ష్మీగణపతి ఆలయంలో గణపతికి ప్రత్యేపూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తురుమళ్ళ శేషకుమార్ తదితర పండితులచే ఎమ్మెల్యే చినరాజప్పకు పూజల అనంతరం ప్రసాదాలు అందజేసి వేదస్వస్తి పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యే చినరాజప్పను అభినందించారు.

పిల్లంక-కాకినాడ బస్సు పునరుద్ధరించాలి

తాళ్లరేవు, ఫిబ్రవరి 14: పిల్లంక-కాకినాడ ఆర్టీసీ పల్లెవెలుగు బస్సును పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో ఆర్టీసీ అధికారులు కాకినాడ-పిల్లంక ఆర్టీసీ బస్సు నడిపేవారని తరువాత నిలిపేశారని స్థానికులు చెబుతున్నారు. మరలా ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని లంకగ్రామాల ప్రజలు కోరుతున్నారు,

వైభవంగా వసంత పంచమి పూజలు

● పలుచోట్ల సామూహిక అక్షరాభ్యాసాలు

సామర్లకోట, ఫిబ్రవరి 14: మాఘమాసం, శ్రీపంచమి మహాపర్వదినం సందర్భంగా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో ససస్వతీదేవి ఉపాలయంవద్ద బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రధానఅర్చకులు చెరుకూరి రాంబాబు, తదితర పండితులచే ముందుగా సరస్వతి దేవికి పంచద్ర వ్యాలతో అభిషేకించారు. పుష్పార్చన పూజలు చేశారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. సామర్లకోట పట్టణ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెంది పదవతరగతి విద్యార్థులచే పండితులు సామూహికంగా సరస్వతి పూజలు చేశారు. వేట్లపాలెంనకు చెందిన కొండపల్లి కృష్ణమూర్తి దంపతులచే మూడువేల పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు. మరొక దాత దేవీ ఫిషరీష్ సంస్థ తరఫున మూడువేల నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దఎత్తున తల్లిదండ్రులు హాజరై చిన్నారులకు శ్రీపంచమి పురష్కరించుకుని అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే మాదవ పట్నం వద్ద కాకినాడరోడ్డులో యండమూరి వీరేంద్ర నాథ్‌కు చెందిన సరస్వతీ విద్యామందిరంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలోరెండువేలమంది చిన్నారులు పాల్గొన్నారు.

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో సరస్వతి దేవి నిలయంవద్ద బుధవారం వసంత పంచమి సరస్వతిదేవి పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఛైర్మన్ నల్లమిల్లిశేషారెడ్డి లక్ష్మిరాజ్యం దంపతులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీరామ్‌శర్మ ఉదయం 6గంటలకు విఘ్నేశ్వర పూజ, 6.30కు సరస్వతి అమ్మవారికి విశేష అభిషేకాలు, 9.31సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్, విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.



గండేపల్లి: ఆదిత్యాలో పూజలు చేస్తున్న దృశ్యం



తుని రూరల్: శ్రీ ప్రకాష్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న విద్యార్థులు

తునిరూరల్: శ్రీప్రకాష్ విద్యాసంస్థలో వసంత పంచమి వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సరస్వతీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వసంత పంచమిరోజు పూజించే ఆచారాన్ని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సామర్లకోటలో పెన్నులు పంపిణీ చేస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం తాటిపర్తి లో ఉన్న అపర్దాదేవి ఆలయంలో వసంతి పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అపర్దాదేవిని బుధవారం సరస్వతి దేవిగా అలంకరించారు. ఆలయంలో సామూహిక్ష అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రిలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గారపాటి బుజ్జి, ఉపసర్పంచ్ దాసం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 14: ప్రత్తిపాడు మండలంలో పలు చోట్ల బుధవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతిదేవి పూజలు వైభవంగా నిర్వహించారు. ఉత్తరకంచి గ్రామంలో ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ప్రాంగణంలో సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి 300మంది చిన్నారులకు అక్షరాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థలు 31ఏళ్ల పూర్తయిన సందర్భంగా పెద్దఎత్తున విద్యార్థులు, తల్లిదండ్రులు తరలి వచ్చారు. భారతీయ విద్యాసంస్థల ప్రాంగణంలో 500మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.

సాగునీరు ఇస్తారా..పరిహారం చెల్లిస్తారా

● ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే వర్మ ఫైర్



మాజీ ఎమ్మెల్యే వర్మను కలిసి సాగునీటి కష్టాలను వివరిస్తున్న రైతులు

పిఠాపురం, ఫిబ్రవరి 14: రెండవ పంటకు పుష్కలంగా సాగునీరు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, రైతులు దాళ్వా సాగు ప్రారంభించిన తర్వాత పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడంలేదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీరు అందిస్తారా లేకుంటే ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లిస్తారా అంటూ ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. పిఠాపురం నియోజకవర్గంలోని పి.రాయవరం సహా వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు ఏలేరు, పీబీసీ కాలువల ద్వారా సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని బుధవారం వర్మను కలిసి విన్నవించారు. తమ పంటలు కాపాడేలా చొరవ తీసుకోవాలని కోరారు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో వరి పంట సాగునీరు అందక ఎండిపోతున్నదని, కొన్ని పొలాలు బీటలు వారాయని వర్మ తెలిపారు. సుమారు 8వేల ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. గెద్దనాపల్లి నుంచి సింహాద్రిరాజు కాలువ వరకూ ఎక్కడికక్కడ గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోయి ఉందని తెలిపారు. పూడికలు తొలగించకపోవడంతో పిఠాపురం నియోజకవర్గంలోని ప్రాంతాలకు ఏలేరు నీరు అందడం లేదని చెప్పారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని లేకుంటే ఎండిపోతున్న పంటకు రూ.30వేలు వంతున అందించాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్, వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టరు దృష్టిసారించి ఏలేరు, పీబీసీ ఆయకట్టు అంతటికీ సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మిచౌంగ్ తుఫాన్ నష్టపరిహారం చెల్లించాలి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి14: మిచౌంగ్ తుఫాన్ నష్టపరిహారం రైతులకు వెంటనే చెల్లించాలని భారతీయ కిసాన్‌సంఘం డిమాండ్ చేసింది. ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామంలో భారతీయ కిసాన్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతుల బ్యాంక్ ఖాతాలకు నేటికీ నష్టపరిహారం జమ కాలేదన్నారు. ప్రభుత్వం పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు సమావేశంలో బీకేఎస్ జిల్లా నాయకులు రాసంశెట్టి రాజా, కందా వీరాస్వామి, సోమన్నదొర, చింతాకుల రామకృష్ణ, ఆకుల హరిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంజీవయ్య సేవలు ఆదర్శనీయం: కలెక్టర్



దామోదరం సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

సర్పవరం జంక్షన్ (కాకినాడ) ఫిబ్రవరి 14 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో సీఎంగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి దామోదరం సంజీవయ్య చేసిన సేవలు ఆదర్శనీయమని కలెక్టర్ కృతికా శుక్లా కొనియాడారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి ఈయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. జేసీ సీవీ ప్రవీణ్‌ఆదిత్య, డీఆర్వో డి.తిప్పే నాయక్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డి.భద్రం, డాక్టర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సత్యదేవుడికి దేవదాయ కమిషనర్ పూజలు



అన్నవరం, ఫిబ్రవరి 14: సత్యదేవుడి సన్నిధిలో బుధవారం దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో వారికి స్వామివారి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ పీఆర్వో కృష్ణారావు, తదితరులున్నారు.

ఆదిత్యలో అంతర్జాతీయ ప్రాజెక్టు ఎక్స్‌పో

గండేపల్లి, ఫిబ్రవరి 14: సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలోని ట్రిపుల్‌ఈ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ ఎక్స్‌పోలో మొత్తం 90 ప్రాజెక్టులు దేశంలోని వివిధ కళాశాలల నుంచి 260కిపైగా విద్యార్థులు పాల్గొన్నట్లు కన్వీనర్ ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులచే రూపొందించిన నూతన ఆవిష్కరణలు ప్రదర్శించారు. ఇటువంటి కార్యక్రమాలను వినియోగించుకుని విద్యార్థుల నైపుణ్యాలను అబివృద్ధి పరుచుకోవాలని వైస్ ఛైర్మన్ సతీష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డీన్స్, వివిధ విభాగాధిపతులు, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న సీఎం'



మేము సిద్ధం కార్యక్రమంలో పాల్గొన్న ముత్తా శశిధర్

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 14: వైసీపీ పాలనలో ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న సీఎం జగన్ రాజన్న పాలన సాగిస్తున్నారని జనసేన సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ విమర్శించారు. స్థానిక 36వ డివిజన్ బాలాజీచెరువు సెంటర్ ప్రాంతంలో సిటీ సహాయ కార్యదర్శి మిరియాల హైమావతి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం పునరుద్ధరించడానికి యుద్ధానికి మేము సిద్ధం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షుడు సుంకర సురేష్, మిరియాల చినబాబు, జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కృష్ణ, సిటీ ఉపాధ్యక్షుడు అడబాల సత్యనారాయణ పాల్గొన్నారు.

కరపలో జనం కోసం పవన్- పవన్ కోసం మనం

కరప, ఫిబ్రవరి 14: కరప మండలం వలసపాకల గ్రామంలో కొత్తపేట, పాతపేట, గొల్లపేట ప్రాంతాల్లో జనం కోసం పవన్- పవన్ కోసం మనం కార్యక్రమం ద్వారా ఉమ్మడి కార్యాచరణలో భాగంగా జనసేన నాయకులు ఎం.శివ, వి.నూకరాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీ పీఏసీ సభ్యులు, రూరల్ ఇన్‌చార్జ్ పంతం నానాజీ ఇంటింటికి పాదయాత్ర చేస్తూ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. దేవు వెంకన్న, ఎస్సీ నాయకులు ఇమాన్యూల్, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన



కరపలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

కరప, ఫిబ్రవరి 14: స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం పలువురు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎన్‌జీవో కరప యూనిట్ అధ్యక్షుడు బీఆర్‌వీ చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు తమ డిమాండ్ల పరిష్కారానికి దశలవారీ ఉద్యమాన్ని చేపట్టామన్నారు. నల్ల బ్యాడ్జీలు ధరించి తమ ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన మెమోరాండాన్ని తహశీల్దార్‌కు అందజేశామన్నారు. 15న మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. 16న జిల్లా కేంద్ర కార్యాలయాల వద్ద, 17న ర్యాలీ, ధర్నా, 20న జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. 27న చలో విజయవాడకు పెద్దఎత్తున ఉద్యోగులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీఎన్‌జీవో కరప యూనిట్ కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి కె.రాఘవకుమార్, కార్యవర్గ సభ్యులు సుజా త, నాగేంద్రకుమార్, కేశవ, చంద్రకళ, సురేష్, చిన్న, ఎండీ గౌస్‌బద్‌రుద్దీన్, ఎన్.ఉమామహేశ్వరరావు, వి.సురేష్ పాల్గొన్నారు.

డీఏ, ఎస్ఎల్‌ను తక్షణం విడుదల చేయాలి

జగ్గంపేట: రాష్ట్రంలో ఉన్న ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ, జీపీఎఫ్, సరెండర్ లీవులు వెంటనే విడుదల చేయాలని జేఏసీ జగ్గంపేట యూనిట్ డిమాండ్ చేసింది. ఉద్యోగ సంఘాల నేతలు తహసీల్దార్ కార్యాలయంవద్ద బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. తమ డిమాండ్లసాధన కోసం 17న ర్యాలీని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాన్ని ఉద్యోగులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నేతలు కృష్ణ, లక్ష్మీనారాయ ణరెడ్డి, సురేష్, రాజారత్నం పాల్గొన్నారు.

రేపు దేశ వ్యాప్త బంద్ విజయవంతం చేయాలి



గ్రామీణ బంద్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 14: రవాణాశాఖ కార్మికులకు నష్టం కలిగే విధంగా కేంద్రప్రభుత్వం అమలుచేసిన భారత్ న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రవాణా కార్మికుల పిలుపు మేరకు ఈనెల 16న దేశ వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని కార్మికులు కోరారు. ఏలేశ్వరంలో రవాణా కార్మికుల కార్యాయంవద్ద బంద్ పోస్టర్లను సంఘ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రొంగల ఈశ్వరావు, పాకల పాటి సోమరాజు, లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ, ఎస్.వెంకటేష్. బి. చిన్నారావు, సత్తార్, ఎస్. శ్రీనివాసరావు, ఆర్‌నవీన్, పి.వీరబాబు, శ్రీనివాస్, రామకృష్ణ, శివ పాల్గొన్నారు.

తాళ్లరేవు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న దేశవ్యాప్తంగా చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు కోరారు. బుధవారం తాళ్లరేవులో ప్రజాసంఘాల నాయకులు సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పిఠాపురంరూరల్: దేశవ్యాప్తంగా ఈనెల 16వ తేదీన జరిగే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. పిఠాపురం మండలం పి.తిమ్మాపురంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో గ్రామీణ బంద్ కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కేంద్రం తీసుకువచ్చిన నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, సబ్సిడీపై ఎరువులు అందించాలని తదితర డిమాండ్లతో ఈ బంద్ చేపడుతున్నామని నాయకులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, కులవివక్ష వ్యతిరేక ప్రచారకమిటీ జిల్లా కార్యదర్శులు కేఎస్ శ్రీని వాస్, కూరాకుల సింహాచలం, ఊబ బుల్లబ్బాయి, కాల్దారి రాఘవ, బత్తుల నాగరాజు, మడికి చిరంజీవి, తంగిడిపల్లి పాప, శివకోటి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

దుంప పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

పెద్దాపురం, ఫిబ్రవరి 14 : మండలంలోని కట్టమూరు, ఆర్‌బీ పట్నం గ్రామాల్లో సాగులో ఉన్న దుంప పంటలను సీటీఆర్ఐ (కేరళ)కు చెంది న శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. డాక్టర్ బైజూ, నెడుం బెచి యన్, జగన్నాథం, రామానందం తదితర శాస్త్రవేత్తలు దుంప పంటలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో సాగులో ఉన్న చిలకడ దుంప, కర్రపెండలం దుంపల పంటల సాగును పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంటలలో ఆశించే తెగుళ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతు లకు అవగాహన కల్పించారు. స్థానిక దుంప పరిశోధనా స్థానంలో సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దుంప పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ జానకి, ఉద్యాన శాఖాధికారిణి నూనే సుజాత, వీహెచ్ఏలు చిలకమ్మ, విజయదుర్గ, సత్తిబాబు, జ్యోతి, మల్లిక, దివ్య పాల్గొన్నారు.

బాలల సంరక్షణపై అవగాహన తప్పని సరి

కొత్తపల్లి, ఫిబ్రవరి 14: బాలల సంరక్షణ విషయంలో మహిళా సమాఖ్య సభ్యులు తప్పనిసరిగా అవగాహన కలిగిఉండాలని స్త్రీశిశుసంక్షేమ అధికారి కె ప్రవీణ అన్నారు. కొత్తపల్లి మండల మహిళా సమాఖ్యలో సభ్యులకు బుధవారం నిర్వహించిన బాలల సంరక్షణపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాలు, వాటి అనర్థాలపై అవగాహన కల్పించారు. జిల్లా పరిరక్షణ విభాగం ప్రతినిధులు, సీహెచ్ వెంకన్న, పోనిక్, ఐ.విఠియ, సోషల్‌వర్కర్ విష్ణు పాల్గొన్నారు.

లబ్ధిదారుల దీక్షను ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం దారుణం

తాళ్లరేవు, ఫిబ్రవరి 14 : చొల్లంగి భూముల్లో పట్టాలు ఇవ్వాలని లబ్ధిదారులు 15 రోజులుగా నిరసన దీక్ష చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పట్టించుకోకపోవడం అన్యాయమని టీడీపీ ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు విమర్శించారు. బుధవారం నిరసన కారులకు కాంగ్రెస్ ఇన్‌చార్జీ సాధనాల రాజాజీ మద్దతును తెలిపారు. కార్యక్రమంలో మేడపాటి తిరుమల రావు, దేవానందం, పులపకూర చిన బాబు, పులగల కుమార్, విస్సాకుల సత్తిబాబు, వల్లు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో సత్తెమ్మతల్లి ఊరేగింపు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి14: ప్రత్తిపాడు గ్రామదేవత సత్తెమ్మతల్లి అమ్మవారి జాతర ముగింపోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఘటంలో అమ్మవారిని బాణాసంచా కాల్పుల మధ్య ప్రత్యేకంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

20న వేంకటేశ్వరస్వామి కల్యాణం

కరప, ఫిబ్రవరి14: యండమూరులో ఉన్న సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఈనెల 20 నుంచి 25వ రకు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు పెద్దింటి సీతారామం తెలిపారు. వైఖా నస మహదాచార్య చక్రవర్తుల వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో 20వ తేదీన భీష్మ ఏకాదశి రోజున ఉదయం ఏడు గంటలకు స్వామి వారికి సహస్రనామార్చన, అమ్మవార్లకు కుంకుమా ర్చన, సాయంత్రం నాలుగు గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, గరుడోత్సవం అనంతరం స్వామివారికి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

గతుకుల రహదారుల నిర్మాణాలకు

రూ.2కోట్ల అరబిందో ఫార్మా నిధులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 14: మండలంలో శిథిలావస్థలో ఉన్న గ్రామీణరోడ్ల ర్మాణాలకు అరబిందో ఫార్మాఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.2కోట్ల నిధులతో రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. బుధవారం యండపల్లి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణానికి అరబిందో ఫార్మా ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఎంపీ వంగా గీత అభ్యర్థన మేరకు ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్ కె.నిత్యానందరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ పి.శరత్‌చంద్రారెడ్డిల ఆధ్వర్యంలో సామాజిక సేవా విభాగం కింద వివిధ గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు రూ.2కోట్లు మంజూరు చేశారని ఫార్మాప్రతినిధులు తెలిపారు.

ఎంఈవో కృష్ణవేణికి ఘన సత్కారం

కరప, ఫిబ్రవరి 14: గణతంత్ర దినోత్సవాన్ని పురష్కరించుకుని ఉత్తమ సేవా పురష్కారం అందుకున్న కరప ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విద్యాభివృద్ధికి బులికృష్ణవేణి చేస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. అనంతరం గజమాలతో ఆమెను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతికుమార్, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంఈవో పత్తి సత్యనారాయణ, వైసీపీ మండలాధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు ప్రారంభం

వేళంగి(కరప), ఫిబ్రవరి 14: స్థానిక కొత్తపేటలో అగ్నికుల క్షత్రియ కళ్యాణ మండపం నిర్మాణ పనులను బుధవారం గ్రామసర్పంచ్ సవిలే నీలిమా రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నబాబు ఈ కళ్యాణమండపానికి రూ.8లక్షలు మంజూరుచేశారన్నారు. శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్ మరమ్మతులకు రూ.2లక్షలు, కొత్తపేట శ్మశానవాటిక సిమెంట్ రోడ్డుకు రూ.15లక్షలు, ఎస్సీ శ్మశానవాటికకు రూ.10లక్షలు, మాదిగ కమ్యూనిటీహాల్‌కు రూ.5లక్షలు మంజూరు చేశారన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు శ్రీకారం

గొల్లప్రోలు, ఫిబ్రవరి 14: పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఈనెల నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లుకు గానూ గొల్లపల్లి చినకొండ దంపతులు పందిరిరాట ముహూర్తం చేశారు. ఉత్సవాల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

శివాలయంలో పూజలు

రౌతులపూడి, ఫిబ్రవరి 14: శివాలయంలో బుధవారం ఉదయం పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో వాసిరెడ్డి శోభన్‌బాబుకృష్ణ, చిట్టమ్మదంపతులు సూర్యనారాయణమూర్తి ఆలయాన్ని నిర్మించారు. నేడు ఆలయం పారంభం సందర్భంగా నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో సూర్యనారాయణమూర్తి, అయ్యప్ప విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అనంతరం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

'గ్రామీణ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి1 4: ఏలేశ్వరం మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, డ్రైన్లు తదితర మౌలిక వసతుల కల్పన వంటి వాటిపై చేపట్టాల్సిన అంశాలను చర్చించారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: ఈగల్, లాల్‌సలామ్, యాత్ర 2

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: ఈగల్, లాల్‌సలామ్, యాత్ర 2

తిరుమల	:	యాత్ర 2
లక్ష్మి	:	ఈగల్
సీ అండ్‌సీ1	:	ఈగల్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	గుంటూరుకారం
పద్మప్రియ	:	అంబాజీ ప్యారేజ్‌బ్యాండు
సత్యగౌరి	:	లాల్‌సలామ్
సూర్య 1	:	ఈగల్
సూర్య 2	:	లాల్‌సలామ్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

పిఠాపురం, ఫిబ్రవరి 14: పిఠాపురం పట్టణ పరిధిలోని బైపాస్‌రోడ్డులో ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ చర్యలు చేపట్టింది. బైపాస్‌రోడ్డుతోపాటు పిఠాపురం-సామర్లకోట రహదారి కలిసే పాదగయ జంక్షన్ తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో అక్కడ ప్రత్యేకంగా స్టాపర్‌బోర్డులు ఏర్పాటుచేశారు. పాదగయ జంక్షన్‌తో పాటు బైపాస్‌రోడ్డులో ఉన్న ప్రధాన జంక్షన్ల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మురళీమోహన్‌లు తెలిపారు.

చోరీలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలి

గండేపల్లి, ఫిబ్రవరి 14: బ్యాంకుల్లో చోరీలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు తీసుకోవాలని సీఐ ఎస్. లక్ష్మణరావు, ఎస్ఐ ఎన్. రామకృష్ణ అన్నారు. వారు బుధవారం మండలంలోని బ్యాంక్ మేనేజర్లతో గండేపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉత్తరకంచిలో జరిగిన బ్యాంక్‌దోపిడీని దృష్టిలో ఉంచుకుని గండేపల్లి పరిధిలో ఉన్న బ్యాంక్ మేనేజర్లకు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

KAKINADA MUNICIPAL CORPORATION
'e' PROCURMENT NOTIFICATION

Roc.No.32637/2023/E2, Dated:14.02.2024

Tenders invited through ap 'e' procurement platform for 81 works with an estimated contract value of **Rs.6,50,46,805/-** From the eligible contractors in the following manner.

Seventy Three Works for an amount of Rs.4,61,94,694/-

Last dated and time for downloading bid documents: 28-02-2024 upto 02-00 PM
Last date and time for submission of bids : 28-02-2024 upto 02.30 PM

Eight Work for an amount of Rs.1,88,52,111/-

Last date and time for downloading bid documents: 04-03-2024 upto 02.00.PM
Last date and time for submission of bids : 04-03-2024 upto 02.30 PM

Tender Inviting Authority: **Commissioner, Municipal Corporation, Kakinada**

Mail: Call Centre Phone: Phone:0884-2357722

Further details can be seen at 'e' procurement market place @www.apeprocurement.gov.in

Sd/- Jallepalli Venkata Rao
Commissioner,
Municipal Corporation,
Kakinada